మరపురాని వసంత

ఉమాపతి పద్మనాభశర్మ

కృష్ణమూర్తి వరండాలోని పడకకుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చూస్తున్నాడు. సాయంత్రం 5 గంటల ప్రాంతం. మబ్బు పట్టటంచేత ఎండ అప్పుడప్పుడు వస్తూపోతూ ఉంది. చల్లని గాలి వీస్తూంది. వాతావరణం, ఎంతవయస్సు మళ్లినవాళ్ళకైనా గిలిగింతలు పెట్టగలిగేంత ఆహ్లాదకరంగా వుంది. ఆసమయంలో ఎంతవాడికైనా వినువీధిలో విహరిద్దామని మనస్సు ఉరకలువేస్తుంది. ఇంతలో 'గలగల'మని మువ్వలచప్పుడూ, డమరుక నాదమూ, పజ్జివాళ్ళ అల్లరి కృష్ణమూర్తి చదువుకు అంతరాయం కలిగించినయ్.

"బాబుగారికి దండాలు. అంబాపలుకు, జగదంబాపలుకు—అయ్యగారికి రాజయోగముంది! బాబూ, భవిష్యత్తు చెప్తాం." అంటూ ఓ బుడబుక్కలవాడు ప్రవేశించాడు. కృష్ణమూర్తికి చికాకు వేసింది. ఈ జ్యోతిషాలూ, మంత్రాలూ అంటే అసలే నమ్మకం లేకపోగా ఇటువంటివాళ్ళని చూస్తే ఒళ్ళు మండుతుంది. ఒళ్లు వంచి పనిచేయలేని సోమరిపోతులందరూ ఇలా వేషాలు వేస్తూంటారు.

"ఏయ్! ఏమీ అక్కర్లేదు గాని ఈ అణా పుచ్చుకుని బయటికినడు." విసుగ్గా అణా ఇవ్వబోయాడు.

"బాబూ! ఉన్నదున్నట్టుగా నిజం చెప్తాం! జోస్యం చెప్పించుకోండి." అని ఎంతవద్దన్నా వినకుండా బలవంతం చేయసాగాడు.

"సరే! లేనికూతలు కూశావంటే నాలుగు తగిల్చి బయటికి గెంటేస్తాను. చెప్పేదేమిటో చెప్పు" అంటూ కుర్చీలో కూర్చున్నాడు మళ్లీ. కృష్ణమూర్తి చెయ్యిని పట్టుకుని ఓసారి పైకీ క్రిందకీ త్రిప్పి "అంబాపలుకవే!" అంటూ ప్రారంభించి, మరోసారి జగ్గు వాయించి "అయ్యగారికి రాజయోగముంది!" అన్నాడు.

"భవిష్యత్తులా ఉంచి గతంలోకి దిగు. సరిగా ఉంటే నే నీ బహుమానం. లేకుంటే.." అన్నాడు మూర్తి.

"అంబాపలుకు. నిజంపలుకు! అయ్యగారి వయస్సిప్పుడు 35 సంవత్సరాలు." "ఇంత వరకు నిజమే. ఈవిషయం వీడే చెప్పాలా! లౌకికం తెలిసిన ప్రతివాడూ ముఖం చూసి అట్టే చెప్పేస్తాడు" అనుకున్నాడు. "అయ్యగారికి సరిగా 23 సంవత్సరాల వయస్సున్నప్పుడు ఒక పెద్దజలగండం తప్పింది" నిజమే. తనోసారి షికారువెళ్తుండగా కాలుజారి మోటబావిలో పడ్డాడు. శంకరావు లేకపోతే తను ఈవరకు ఏ స్వర్గలోకంలోనో ఉండేవాడు. తనకింతవరకూ ఈత రాకపోవటం సిగ్గనిపించింది. "ఊఁ! తర్వాత?" అన్నాడు ఈవిషయం కాకతాళీయంగా నిజం కావచ్చు గదా అనుకుని.

"బాబుగారు ఒకసారి" అని ఆలోచిస్తూ "సరిగా పన్నెండుసంవత్సరాల క్రితం ఒక ఊరినుంచి కాలినడకను వస్తూంటే దారిలో నాగుకరచి చచ్చిబ్రతికారు."

"ఘటికుడిలా వున్నాడే! ఉన్నదున్నట్టు తేదీలతోసహా చెప్పేస్తున్నాడు," అనుకున్నాడు-అయినా ఈ జోస్యాన్ని నమ్మితే తన M.Sc కి నామోషీ అనుకుని వినోదంగా వాడు చెప్పేది వింటున్నాడు-

"నిజమేనా బాబుగారు?" అని గద్దిస్తున్న ధోరణిలో గుడ్లు లావుగా తెరచి జగ్గు వాయించాడు వాడు. బాబుగారు ఉలిక్కిపడి నిజమేనని ఒప్పుకున్నారు. "ఇంకా చెప్తాను. అంబా పలుకవే! జగదాంబ చెప్పవే! బాబుగారికి కోపం రాదంటే ఇంకో నిజం చెప్తాను."

"కోపమెందుకొస్తుంది? కొంపదీసి నేడో రేపో చచ్చిపోతానని చెప్పడుగదా" అని భయపడ్డాడు. కాని వెంటనే తనకు పట్టబోయే 'రాజయోగం' సంగతి జ్ఞాపకమొచ్చి చెప్పమన్నాడు. అయినా వీడింత పచ్చి నిజాన్ని ఎలా చెప్తున్నాడా? నమ్మక తప్పేట్టు లేదే! ఉత్సాహంగా "చెప్పేసెయ్-కోపమేమీ రాదులే" అన్నాడు. "అయ్యగారికి కోపం రావద్దు. జగదాంబ పలుకు..." అంటూ ఇంకా ఏమేమో వాగుతూ రెండు మూడు నిమిషాలు గడిపాడు. "వెనవసప్పెన్సులో పెట్టక అదేమిటో త్వరగా చెప్పేసేవయ్యా!" అదేమిటో తెలిసికోవాలన్న పట్టుదల రెట్టింపయింది మూర్తికి, "జగదాంబ చెప్తుంది. అయ్యగారు నేటికి సరిగా" అంటూ తలపైకెత్తి ఆలోచించసాగాడు వాడు. "ఎంతకాలానికి చనిపోతానంటాడో?" అనుకుని, అయినా నిశ్శబ్దంగా వింటున్నాడు. "నేటికి సరిగా 11 సంవత్సరాల 4 మాసాల క్రితం ఒక అమాయకురాలైన ఇల్లాలిని నిలువునా చెరచారు. ఆమె ఊరు వాయవ్యదిశ. పేరూ, ఇంకా వివరాలు చెప్పాలంటే యంత్రం వేయాలి." అంటూ డమరుక వాయించాడు. ఈ విషయం చెప్పేసరికి మూర్తిగుండె ఒక్కసారి ఆగిపోయినంత పనయింది. ముఖం వివర్ణమై శాగా చెమటపోసింది. "అసాధ్యుడల్లే ఉన్నాడే!" అనుకున్నాడు.

* * *

జీవితంలో మహోల్లాసం

కాల్గేట్
బొరేటెడ్
బేబీపౌడర్ వాడకంతో

...అందుచేతనే, విజ్ఞులైన తల్లులు తమ పిల్లల అతి సుకుమార శరీరాన్ని బాధాకరమైన చర్మవ్యాధులు సోకకుండా రక్షించడానికిగాను కాల్గేట్ బొరేటెడ్ బేబీ పౌడర్ వాడతారు. అతి సున్నితమైన శరీరాలను మృదువుగా, లాలిత్యంగా వుంచడానికి శాస్త్రీయ పద్ధతులపై తయారుచేయబడింది. తాపమెక్కి ఎండ వేడిమికి చర్మం పెట్లకుండా కాపాడుతుంది - ...రోజంతా చల్లదనమిచ్చి, పిల్లలు సుఖంగా వుండడాని కుపకరిస్తుంది. దాని కమ్మని వాసన మిమ్ము, మీ పిల్లలను సమ్మోహితులను చేస్తుంది.

ఆదాకు జెయింట్ సైజు కొనండి

★ మరపురాని వసంత ★

అవి హైదరాబాదులో MSc చదువుతున్న శుభదివసాలు. చదువు పూర్తికాకముందే ఒక బి. యే. గారితో సలక్షణంగా వివాహమై పోయింది తనకు. అమ్మ బలవంతంవల్ల పెళ్ళి చేసికొనక తప్పలేదు. మనవణ్ని ఎత్తుకోవాలని ఆమెకు మహాయిష్టంగా వుండేది. అందుచేత శ్రీమతిగారితో సహా పట్టణంలో ఓ ఇల్లు అద్దెకు కుదుర్చుకుని ఇటు సంసారం, అటు చదువూ వెలిగించేవాడు. "వివాహో విద్యానాశాయ" అంటారుకాని అది తనవిషయంలో పూర్తిగా విలోమంగా ఉండేది. చదువుకు ఎలాటివిఘ్నమూ రాకుండా శ్రీమతిగారు [బి. యె. కాబట్టి] తాను సక్రమ పద్ధతిలో చదువుకునేట్టు చూచేది. తోటి విద్యార్థులందరికీ సంసారంలో ఉండే సుఖం తెలియదు; సంసారులందరికీ యూనివర్సిటీలో విద్యార్థిగావుండే ఆనందం తెలియదు. అవిరెండూ తనకు ఏకకాలమందే లభ్యమయ్యే మహాభాగ్యం కలిగింది. ఇంటికి రాగానే స్వర్గంలో కొచ్చినట్టనిపించేది. యూనివర్సిటీ కెళ్లితే ఇంద్రసభకు వెళ్ళినట్టుగా వుండేది. ఇలా దినాలు క్షణాలుగా గడిచిపోతుండేది. నిజంగా అటువంటి మహదానందం మళ్ళీ ఎన్నటికీ రాదు.

ఇంతలో శ్రీమతి పురిటికని వెళ్ళటమేమిటి, ఇక MSc పరీక్షలు నెల పదిహేనురోజుల్లో జరుగనున్నవని తెలియటమేమిటి, - ఒకేసారి జరిగాయి. శ్రీమతిగారు 'తాను రెండు మాసాల్లో బిడ్డనెత్తుకుని వస్తాననీ, పరీక్షకోసం చదువును విస్మరించరాదనీ, తననీ రెండునెలలూ స్మరించకూడదనీ...ఈ విధముగా మరేవో కొన్ని షరతులుపెట్టి, ఎంత వద్దన్నా తండ్రిగారి బలవంతంమీద వెళ్ళిపోయింది. తన అమ్మకోరిక దీరే సుసమయము వచ్చిందని చాలా సంతోషపడ్డాడు.

పోయినతరువాత ఒకరోజు, రెండురోజుల వరకూ మామూలుగానే ఉన్నాడు. కాని రానురాను పరిస్థితంతా అయోమయంగా తయారైంది. చదువుకోడానికి వెళ్ళటం పూజ్యమయింది. వాతావరణంలోని మార్పుల వల్ల ఒళ్ళుగూడ కొంచెం బద్ధకించింది. రోజులు గడచిపోతున్నాయి. గడచినకొద్దీ ఆరోగ్యం-ముఖ్యంగా మానసికారోగ్యం చెడిపోతూవచ్చింది. మనస్సు ఒకదానియందు లగ్నంకాకుండా, పరిస్థితి విషమించిపోతూవుంది. శ్రీమతిని త్వరగా పంపించమని మామగారికి రెండు మూడు కార్డులు వ్రాసినా వాళ్లు నవ్వులాటగా భావించి, "బిడ్డతోసహా వస్తుందనీ, ఎలాగో ఈ కొద్ది రోజులు ఓపికపట్టమనీ జవాబు వ్రాశారు. అది చూసినప్పట్నుంచీ మరీ దిగులు పట్టుకుంది. ఇంకా కొన్నిరోజులా? అధమంగా ఇంకోనెల! ఒక్కడూ ఎలా ఉండటం? వెళ్ళినా శ్రీమతిని పంపించరు. అందులో తీరా పరీక్షల సమయం. చదువుదామని పుస్తకం తెరిస్తే మనస్సు ఢిల్లీపైపుపోతుంది; పుస్తకం బంగళాఖాతంలో పడుతుంది. యూనివర్సిటీకా వెళ్లడంలేదు, ఇంకో ఉద్యోగమా? నాస్తి. ఉన్నా చేసేఓపికెక్కడిది? శరీరంమాస్తే అలా వుంది. హోటలు మెతుకులు నాలుగు మ్రింగటం - అదీ ఒకోనాడు లేనే లేదు—అస్తమానూ ఇంట్లో పచార్లు కొంతసేపూ, పడక కొంతసేపూనూ. దినమోగండంలా వుంది. ఇప్పుడు నిజమనిపిస్తూవుంది "సర్వం నాథాయ శోభనం" అనే సూక్తి. శ్రీమతి ఇంట్లో తిరుగుతున్నట్టే అనిపించేది. ఒక్కొక్కప్పుడు నిద్రలోనుండి పలవరిస్తూ హఠాత్తుగా మధ్యరాత్రప్పుడు మేల్కొనేవాడు. యథాప్రకారంగా ఆరిపోయినలైటు అగుపడేది. అంతా పిచ్చిపిచ్చిగా వుండేది వ్యవహారం. జీవితమింకెన్నాళ్లిలా గడపడం? ఒక్కొక్కరోజు గడవటమే మహా యాతనగా వుంది. అనుభవమైతేతప్ప ఒకరికి చెప్తే అర్థంగాదు. అయినా తనగోడు విని సానుభూతిచూపించే ఆపత్కాలబంధువుడెవ్వడూ లేడు తనకు. ఒకసారి ఇంటవ్వ వచ్చి అడిగింది. "ఏం నాయనా! శశి వెళ్ళినప్పట్నుంచీ ఎలాగోవుంటున్నావు?"అని. "ఏంలేదవ్వా! పరీక్షలకోసం రాత్రింబవళ్ళు చదువుతూ ఉండటంచేత కొంచెం సుస్తీ అయిందంతే" అని పేలవంగా నవ్వాడు. ఇక లాభంలేదు. పరీక్ష పోతే పోయింది. కాని శ్రీమతిని చూడకుండా వుండటం వల్లగాదు. బయల్దేరాలి. తప్పకుండా రేపే బయల్దేరాలి, అని దృఢంగా నిశ్చయించుకున్నాడు.

అక్షరాలా వాతావరణం ఆరోజునకూడా ఇలాగే మబ్బుపట్టి చల్లని గాలితెరలు వస్తున్నాయి. ఇదే 8 గంటల సమయం. ఆకాశంలో వర్షసూచన అగపడుతూ వుంది. చల్లని గాలికోసం తలుపులు తెరచుకుని ద్వారానికెదురుగుండా ఉండే పడకకుర్చీలో కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాడు. తనగది కెదురుగా ఇంకోగది వుంది. దాన్లో ఇల్లుగలవాళ్లి సామానవి ఉంటాయి. అప్పుడప్పుడూ దాన్లోకి వెళుతూ తనను పలకరిస్తూ వుండేది అవ్వ.

ఇంతలో వీనులవిందుగా ఏదో కంకణక్వణనం వినబడి, సువ్యక్తమైన మధురానుభూతిని కలిగించింది. వ్రాతనాపివేసి ఎదురుగుండా చూచాడు. ఎవరో జవ్వని ఆ గది తాళం తీస్తూవుంది ఓరగాచూస్తూ. బహుశః వసంతేమో! తానెన్నడూ ఆవిడను చూళ్లేదు గాని అవ్వ పిలుస్తూన్నప్పుడు ఆ పేరును చాలాసార్లు విన్నాడు. నిజంగా వసంతంలో వికసిస్తూన్న గులాబి మొగ్గలా వుంది వసంత. కాని పాపం! ఆమె అందానికి తగినట్టుగా రామప్రసాదు నల్లగా యమకింకరునికిమల్లే వుంటాడు. లోనికి వెళ్ళి సామానేవో సర్దేసి బయటికొస్తున్నప్పుడు ఆమెముఖం కనిపించింది. అబ్బ! నిజంగా బ్రహ్మదేవుడు ఒకసారి తన స్వహస్తాలతో,బంగారుతో ఆమెను తయారుచేసి దానికి సౌరభ్యాన్ని కూడా అమర్చినట్టున్నాడు. ఎంత అందం! వర్ణిస్తే, విని ఊరుకుంటారు గాని ఆమెను చూస్తే ఎంత నిగ్రహం గలవాడయినా గుటకలు మ్రింగక మానడు. కుర్చీలోంచి లేచి తన లాంగ్‌కోటును సవరించుకున్నాడు మూర్తి ఆమెను చూస్తూనే. తలుపు తాళంవేసి తనవైపు ఓసారి లేడికళ్లతో చూచి భయంతో కూడిన చిరునవ్వు నవ్వింది. ఆ వసంత దరహాసం, ఎండి మోడైపోయిన తన జీవితాన్ని వసంత ఋతువులాగా ఒక్కసారే చిగురింపజేసింది. అది చిరునవ్వు కాదేమో! ఆమె సహజమైన ముఖకాంతిలో తానే ఆనవ్వును ఆపాదించుకున్నాడేమో! అనుకుని వూరకున్నాడు.

ఓ పదినిమిషాల తర్వాత మళ్ళీ వచ్చి గది తలుపులు తెరచి లోనికిపోయి వెంటనే వెనుదిరిగి ప్రత్యేకంగా మరోసారి నవ్వింది. ఆ లేవెలుగులో, మేఘాల చాటునుండి తొంగి చూచే చందమామలా వుంది వసంత ముఖం. ఏదో ప్రబంధంలోని వాతావరణం గోచరమయింది. ఈసారి నిజమనుకోక తప్పలేదు. ఆమె తన్నుచూచి చిరునవ్వు నవ్వటంలో ఆశ్చర్యం లేదు. ఆమె అందానికి—అనకూడదు గాని—తనలాటి వాడు భర్తయినా లోటే. అలాంటిది రామప్రసాదు—పాపం—ఆలోచిస్తే గుండె తరుక్కుపోతుంది. ఆమె వెళ్ళిపోయింది. తనలో ఎందుకో ఆ క్షణం నుంచీ ఉత్సాహం పెల్లుబికింది. పురుషులు అల్పసంతోషులుగదా! కొళాయివద్దకి పోయి శుభ్రంగా స్నానంచేసి స్వచ్ఛందమైన దుస్తులు వేసికొని 6 దాటక ముందే హోటలుకని బయలుదేరాడు. చల్లనిగాలి. ఆ గాలిలో ఏదో అవ్యక్తమయిన సువాసన ఇమిడి హృద్యమంగావుంది. ముంగురులు ఫాలభాగంలో దోబూచులాడుతున్నాయి.

వెళ్ళి భోంచేశాడు. శ్రీమతి వెళ్ళినప్పటినుంచీ కడుపునిండా భోంచేసిం దాపూ లే. — ఇంటికొచ్చేసరికి ఏడయింది. ఆకాశంలో మేఘాలు దట్టంగా పరుగిడుతున్నాయి. లైటు వెలిగించి అదే కుర్చీలో కూర్చుని ఏదో వ్రాస్తున్నాడు. కలం నడుస్తూనే వుంది. కాని హృదయాన్ని మాత్రం వసంత లాక్కుపోతూంది. ఎనిమిదయింది. అలాగే కూర్చున్నాడు. "మా చెదవేలనో ప్రణయసుందరి" పద్యం జ్ఞాపకమొస్తూంది. ఆ చిరునవ్వులోని అంతరార్థమేమిటో? అయినా అది నిజమో, భ్రమో? ఒకవేళ నిజమైతే తన పరిస్థితిని చూచి హేళనగా నవ్విందో-ఇలా సాగుతూంది ఆలోచన. వెంటనే శ్రీమతి జ్ఞాపకమొచ్చి తనవైపు నిశితంగా చూస్తున్నట్టనిపించింది. 'ఛీ! పరకాంతల తలచుకోవడం మహాపాప' మనుకుని ఊరట కల్పించుకో జూచాడు-గడియారం చూచాడు-తొమ్మిది-కాని వసంత అయస్కాంతంలా లాగుతూ వుంది. శశికళను వసంతలో మనోనేత్రంతో చూడసాగాడు. తనకు తెలియకుండానే ఉద్రేకం హెచ్చింది. అందులో ఇంకో విషయం వెంటనే జ్ఞప్తికొచ్చింది. రామప్రసాదు నిన్ననే వ్యాపారంకోసం బొంబే వెళ్ళాడు. 8 రోజులకుగాని తిరిగిరాడు. ఉద్రేకం రెట్టింపయింది. గాలి జోరుగా వీస్తూంది. కిటికీ తలుపులు మూశాడు. వీధి లైట్లన్నీ వెలుగుతున్నాయి. ఉన్నట్టుండి కుంభపోతగా వర్షం ప్రారంభమయింది. పదకొండుగంటల సమయం. విశ్వమంతా నిద్రాదేవిఒళ్ళోకి పోతోంది. గదిబయట కొచ్చి తలుపువేశాడు. మనస్సు వారించినా కాళ్లు వాటంతటవే ముందుకు సాగిపోతున్నాయి. అవ్వగది దాటి, వసంత పడకగది వద్దకు ప్రవేశించాడు. ఇంట్లో లైట్లన్నీ ఆర్పిచేయబడటంచేత కన్ను పొడుచుకున్నా కానరాని కటికచీకటి. గుడ్డివాడిలా తడుముకుంటూ వెళ్లాడు. గది తల్పులు ఓరగా వేసివున్నాయి. కామానికి కళ్లు లేవు. అది ఎంత వివేకవంతుల్నయినా నీచానికీ, క్షమించరాని మహాపరాధానికీ గురిచేస్తుంది. లోపల బెడ్ లైటేమో, ఉండీ లేని సమానంగా మసకమసకగా వెలుగుతూన్నట్టుంది. వర్షం జోరుగా కురుస్తూ వుండటంచేత రేకులు డబడబా చప్పుడు చేస్తున్నాయి. తనకాళ్లు గజగజా వణుకుతున్నాయి. అంతవానలోగూడ ఉక్కగా వుంది. 'ఒకవేళ వసంత దొంగ దొంగ అని అరవటమో లేక అల్లరిచేయటమో అలాంటిదేదైనా జరుగుతే అమ్మో! ఇంకేమైనా వుందా? కొంప నిలువునా మునుగుతుంది. ఆడవాళ్ళు నాలుగుగోడల మధ్య ఒంటరిగా వున్నప్పుడు అబలలుగా వుండరు. నమ్మరాదు. ఈ వర్షంలో ఎవరికీ వినబడకున్నా, రేపు ఎలాగా బ్రహ్మాండం బద్దలయి తీరుతుంది. మనస్సు, సంస్కారం వెనక్కు లాగాయి. కాని అప్పటి చిరునవ్వు శరీరాన్ని బలవంతంగా పురోగమింపజేస్తూ వుంది. ఉద్రేకం, అవకాశం, దానికి దోహదం చేస్తున్నాయి. అంతటి సాహసం తన జన్మలో ఇంతవరకూ చేయలేదు. ఇకముందు కూడా చేయడు. "ధైర్యసాహసేలక్ష్మీ"అనుకుని తలుపులు త్రోశాడు-"వసంతా" అని పిలిచాడు. ఆ పిలుపు అగాధంలోంచి వచ్చింది. గుండె వేగంగా కొట్టుకుంటూ వుంది వలలో చిక్కిన పక్షిలా. అంత చప్పుడులో ఎలా వినిపించుకుందో?-ఆప్యాయంగా ఆహ్వానించింది. సహృదయంగా ఆదరించింది. బెడ్ లైటు ఆర్పివేసింది. అంతే! ఆనాడుస్వర్గం-అన్నా తక్కువే!

ఇక తెల్లవారింది. ఎంచేతో ఇక ఆ యింట్లో ఒక్కనిమిషమైనా నిలువ బుద్ధి పుట్టలేదు. స్వర్గం, నరకంగా మారటానికి ఎంతోసేపు పట్టదు. తన పరువూ, ప్రతిష్ఠా, పలుకుబడీ, చదువూ, సంస్కారమూ, అన్నీ నాశనమవటానికి గూడ ఎంతో కాలం పట్టదు. ఆంతరంగిక జీవితంలో అవన్నీ నశించిపోయినట్టే. కాని ప్రపంచంలో ఉన్న నాలుగు నాళ్ళూ తలెత్తుకుని తిరగటంకోసం, పెద్దమనిషిగా బ్రతకటంకోసం ఆ యిల్లు విడవక తప్పలేదు. ఆరోజే అవ్వకు ఏదో కారణం చెప్పి, ఆనెల అద్దె చెల్లించి, ఇల్లు ఖాళీచేసి, శ్రీమతి వచ్చేవరకూ 'వసంత్ విహార్'లో గడిపాడు. పరీక్షపోలేదు. సరి కదా! ఏమీ చదవకుండానే ప్రథముడుగా వచ్చాడని తోటివాళ్లందరూ తన్నభినందించారు. అదంతా వసంతచలవవల్ల అని తనకుదప్ప ఈ సువిశాల ప్రపంచంలో మరే ప్రాణికీ తెలియదు. ఇదీకథ. నేటికి సరిగా పదకొండు నిండువసంతాలూ, నాలుగు పూర్ణశశికళలూ గడిచాయి. ఈ విషయం బ్రహ్మకుగూడా తెలియలేదు. కాని ఈ జోస్యం తన్ను వెర్రివాణ్ణిచేసింది.

కృష్ణమూర్తి ముఖం కళావిహీనమై పోయింది. శరీరమంతా బలహీనమయి పోయింది.

* * *

"అంబా పలుకు, జగదాంబ పలుకు" అంటూ డమరుక వాయించాడు వాడు. "...నిలువునా చెరచారు" అని వాడన్నమాట తిరిగీ అంతరంగంలో ధ్వనించింది. "ఆమెను చెరచటమేగాదు. నేనూ చెడిపోయాను" అని అతని మూగగొంతుక ప్రతిధ్వనించింది.

ఓ రెండు రూపాయల కాగితం తీసి వాడి చేతిలో పెట్టి వాణ్ణి సాగనంపాడు. జోస్యమన్నా, మంత్రాలన్నా ఆ రోజునుంచీ బలంగా నమ్ముతున్నాడు-నమ్మక తప్పదు.

* * *

కాని, రెండు సంవత్సరాలకు గాని, ఆరోజు వసంతగదిలోనికి వెళుతున్నప్పుడు కూడా తన డైరీని పట్టుకెళ్లాననీ, వచ్చేప్పుడు అది తీసికొనిరావటం మరచాననీ, వచ్చిన బుడబుడక్కలవాడు వివేకంగల రామప్రసాదే అనీ, తెలియలేదు కృష్ణమూర్తికి.

కాని ఒక్క సందేహం మాత్రం ఇప్పటికీ అలానే మిగిలిపోయింది. "పదకొండు సంవత్సరాల వరకూ తన డైరీ ఎక్కడ దాక్కుని వుందే?" అని.

తనకు వసంత ఊరుపేరూ అలా వుంచి. ముక్కూ, ముఖమూ గూడా సరిగా తెలియదు. అలాంటి వసంతయొక్క శేషజీవితాన్ని గురించి, తనుతప్ప ఎవరూ ఆలోచించి, నిజమైనసానుభూతిని పొందలేరు. ★